తిరునగరిలో సంక్రాంతి సందడి





తాతయ్యగుంట కూడలిలో భోగి మంటలు

తిరుపతి కల్చరల్: సంక్రాంతి పండుగ ఒక రోజు ముందే ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో సంక్రాంతి సందడి మొదలైంది. ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పర్వదినాలు రానున్నాయి. వస్త్ర, బంగారు దుకాణాలతోపాటు కొనుగోళ్లపై ప్రత్యేకంగా పండుగ ఆఫర్లు కల్పించారు. నగరంలోని గాంధీ రోడ్డు, తీర్థకట్టవీధి, ఇందిరా కూరగాయల మార్కెట్ జనంతో కిక్కిరిశాయి.

భోగి మంటల వెలుగులు

ఆదివారం భోగిపండుగ కావడంతో శనివారం అర్ధ రాత్రి నుంచే ఇళ్ల ముంగిళ్లు, వీధులలో, ప్రధాన కూడళ్లలో భోగిమంటలు వేశారు. తాతయ్యగుంట కూడలిలో తాతయ్యగుంట యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం రాత్రి పూజలు నిర్వహించి భక్తి ప్రపత్తులతో భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, తిరుమలరెడ్డి, స్థానిక యువకులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు, గాలిపటాల వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోడి పందాలు, రంగుల రంగవల్లికలు, పొట్టేలు పందాలు, గంగిరెద్దులు, హరిదాసు, కత్తిసాము, గోళీలు, బొంగరాలు తదితర తెలుగు సంప్రదాయ ఆటలు ప్రదర్శించారు. అనంతరం గాలిపటాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. భోగి మంటలు వేసి తిరుపతి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, కమిటీ సభ్యులు విజయకుమార్, శ్రీనివాస్, గుండాల గోపినాథ్‌రెడ్డి, నరసింహాచారి, చిన్నం నవీన్, నవీన్‌కుమార్‌రెడ్డి, జీవన్, వాసు, చంద్రశేఖర్, శేఖర్, సాయిప్రసాద్, పార్థసారథి, రెడ్డిబాబు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

మంగళం రోడ్డులోని బీటీఆర్ కాలనీలో సంక్రాంతిని పురస్కరించుకొని వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ రేణుదీక్షిత్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు నాగార్జున, వెంకటేష్, ఉయ్ సపోర్ట్ సంస్థ నిర్వాహకురాలు తహసున్నీసా బేగం పాల్గొన్నారు.



రాస్‌లో...

రాస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత ముఖ్య అతిథిగా హాజరై సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. న్యాయమూర్తి సరిత మాట్లాడుతూ సంక్రాంతిని కుటుంబ సభ్యుల సమక్షంలో వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. రాస్ సేవలను ఆమె కొనియాడారు. మహిళా వికాస్ సమత, డైరెక్టర్ నాగరాజు, శ్రీనివాసులు, రమేష్ రెడ్డి, బాలాజిరెడ్డి పాల్గొన్నారు.



సంబరాలు ప్రారంభిస్తున్న ఐదో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి సరిత, రాస్ ప్రతినిధులు



వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



బీటీఆర్ కాలనీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రేణుదీక్షిత్

నేడు శ్రీగోవిందరాజ స్వామి భోగి తేరు

తిరుపతి కల్చరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో భోగి పండుగ సందర్భంగా స్వామివారి భోగి తేరు ఊరేగింపు వేడుకగా నిర్వహించనున్నారు. అలాగే సోమవారం ఆలయంలో మకర సంక్రాంతి వేడుకలు జరుగనున్నాయి. భోగి పండుగ నాడు సాయంత్రం 5.30 నుంచి రాత్రి గంటల వరకు శ్రీఆండాళ్ అమ్మవారు, శ్రీకృష్ణ స్వామివారిని భోగితేరుపై కొలువుదీర్చి ఊరేగింపు చేపడుతారు. సోమవారం మకర సంక్రాంతి సందర్భంగా ఉదయం సంక్రాంతి తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. ఉదయం 6.30 గంటలకు ఆలయం నుంచి చక్రతాళ్వార్‌ను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా కపిలతీర్థంలోని శ్రీఆళ్వార్ తీర్థానికి వేంచేపు చేస్తారు. అక్కడ చక్రస్నానం అనంతరం ఆస్థానం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారు నాలుగు మాడ వీధుల్లో తేరుపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు.

క్లుప్తంగా

26 నుంచి ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ మోహన్

తిరుపతి కల్చరల్: చెన్నై శంకర నేత్రాలయ సౌజన్యంతో ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు వారం రోజులపాటు తొండవాడ గ్రామంలోని సచివాలయంలో పేదలకు ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ మోహన్ మల్లం తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్ల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలతో ప్రత్యేక థియేటర్ సౌలభ్యం కలిగిన రెండు బస్సుల్లో అత్యాధునిక టెక్నాలజీ వినియోగంతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 22 మంది వైద్య బృందం ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 94400 77932, 98483 15857 సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

భక్తి ప్రపత్తులతో గోవిందనామ సంకీర్తన

తిరుపతి కల్చరల్: ధనుర్మాసంలో చివరి శనివారం వేకువజామున రంగస్థలి కళాకారులు భక్తిశ్రద్ధలతో శ్రీగోవిందరాజ స్వామి మాడ వీధుల్లో శ్రీగోవిందనామ సంకీర్తనతో సంచారం చేశారు. ఈ సందర్భంగా రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ధనుర్మాసం సందర్భంగా చేపట్టిన గోవింద నామ సంకీర్తన సంచారాన్ని ఒక ప్రతి శనివారం నిర్వహిస్తూ తద్వారా నగర ప్రజల్లో భక్తి భావాన్ని పెంచేందుకు కృషి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రంగస్థలి కళాకారులు కేపీ రాజా, పొన్నాల జేజిరెడ్డి, పద్మనాభన్, వాసుదేవ, భాస్కరాచారి, సుబ్రమణ్యం రెడ్డి, రెడ్డెప్ప, భక్తులు పాల్గొన్నారు.

28న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక



బ్రాహ్మణ వధూవరుల పరిచయ పోస్టర్లను విడుదల చేస్తున్న శేషగిరిరావు, రామమూర్తి

పుంగనూరు : తిరుపతి పట్టణంలోని ఇస్కాన్ మందిరం రోడ్డులో ఉన్న కంచి కామకోటి పాదుకా మఠంలో ఈ నెల 28న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు బ్రాహ్మణ సంఘం నాయకులు శేషగిరిరావు, కాసలనాటి రామమూర్తి తెలిపారు. వారు శనివారం పుంగనూరులో పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ గాయిత్రీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 32వ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ వధూవరులు తమ పూర్తి వివరాలతో పరిచయ వేదికలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు మధు, కృష్ణమూర్తి, గిరి, శ్రీనివాసరావు, రమణ రావు, అశ్వర్థనారాయణ, మల్లికార్జున, ప్రణీత్, రాజేష్, మహేష్, పవన్, విహారి, వినోద్‌అర్ష తదితరులు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు సాక్షాత్కరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవ నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటిండెంట్ వెంకటస్వామి పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ టీఏ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఉపాధ్యాయులు

తిరుపతి కల్చరల్: వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రూపొందిన 2024 డైరీని శనివారం ఎంపీ కార్యాలయంలో ఎంపీ డాక్టర్ గురుమూర్తి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో మౌలిక సదుపాయాలను కల్పించి, ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను అందిస్తూ విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తయారు చేయడానికి విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చిందన్నారు. వైఎస్ఆర్ టీఏ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. ఈ వేళ తరగతి అంటే రేపటి భారతదేశం, ఆ తరగతి గది నాయకుడు ఉపాధ్యాయుడు అని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు స్థానంలో వచ్చి మార్పు 21వ శతాబ్దంలో టీచరు డిజిటల్ టీచర్‌గా మారడమేనని తెలిపారు. తరగతి గది నుంచి బయట ప్రపంచంలో అడుగు పెట్టిన విద్యార్థి బయట వ్యవస్థల అవసరాలకు ఆసరగా కాగల తీరులో సాంకేతికతతో చదువు బోధించాలని సూచించారు. అలాగే వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. వైఎస్ఆర్ టీఏ జిల్లా అధ్యక్షులు మద్దెల ముని శారద, ప్రధాన కార్యదర్శి వి.ఎల్లప్పరెడ్డి, కోశాధికారి బాబూలాల్, ఉపాధ్యక్షులు అల్లయ్య, సఫీసా, మీడియా ఇన్‌చార్జ్ స్వప్న పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు శ్రీవారి ప్రసాదాలు



వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ శ్రీనివాస్‌కు ప్రసాదాలను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యో సంఘాల నాయకులు

తిరుపతి తుడా: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఏపీ హంస, గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజ నేతృత్వంతో అసోసియేషన్ నాయకులు శనివారం శ్రీవారి ప్రసాదాలు, క్యాలెండర్, డైరీలను అందజేశారు. విజయవాడకు వెళ్లి వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కమిషనర్ శ్రీనివాస్, డైరెక్టర్ పద్మావతి, గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ వెంకటరామిరెడ్డిలను అసోసియేషన్ నాయకులు ఇమ్రాన్, రాజేష్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గొబ్బెమ్మకు పురవీధి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం గొబ్బిదేవత ఉత్సవం వేడుకగా జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో గొబ్బెమ్మ ఉత్సవమూర్తికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా ముగిసిన ఆండాళ్ నీరాటోత్సవాలు



నీరాడ మండపంలో కొలువై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీఆండాళ్ అమ్మవారు



ఊరేగింపుగా నీరాడ మండపానికి శ్రీఆండాళ్ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఏడు రోజులపాటు చేపట్టిన శ్రీఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం 5.30 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారు ఊరేగింపుగా బయల్దేరి శ్రీగోవిందరాజస్వామి ఆలయ మాడ వీధులు, చిన్నబజారు వీధి, శ్రీకోదండరామాలయం మాడ వీధుల గుండా రామచంద్ర కట్టపైనున్న నీరాడ మండపానికి చేరుకున్నారు. అక్కడ మండపంలో అమ్మవారిని కొలువుదీర్చి వేడి నీళ్లతో అభిషేకంచేశారు. సాయంత్రం వరకు అమ్మవారు అక్కడే ఉండి భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం శ్రీఆండాళ్ అమ్మవారు బంగారు తీరుచ్చిపై శ్రీకోదండ రామాలయం చుట్టూ ప్రదక్షిణ చేసి ఊరేగింపుగా తిరిగి శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు హారతులు సమర్పించారు. ప్రతి ఏటా ధనుర్మాసంలో ఆండాళ్ అమ్మవారు స్వామివారి కోసం చేసిన తపస్సుకు ప్రతీకగా ఈ ఉత్సవం నిర్వహిస్తారు. డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్, ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనుంజయ పాల్గొన్నారు.